క్లుప్తంగా

‘మద్దెల’కు అవార్డు



అవార్డు అందుకుంటున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం జిల్లాకు చెందిన గాయకుడు మద్దెల శివకుమార్‌కు ఎస్పీ బాలసుబ్రమణ్యం అవార్డు లభించింది. బాలసుబ్రమణ్యం జన్మదినం సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, రాజన్ సప్తస్వరాలు సంస్థల ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించి అవార్డు అందజేశారు. ఆమని, గొల్లపల్లి దయానందరావు, అందెల ఆనందరావు, గాంధీ, మూర్తి, కుసుమ బోగరాజు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం నమ్మొద్దు

జూలూరుపాడు: కొన్ని నెలలుగా ఎమ్మెల్యే అభ్యర్థులు ఖరారైనట్లు సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాళోత్ మంగీలాల్ నాయక్ అన్నారు. బుధవారం జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటిస్తుందన్నారు. హైకమాండ్ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించే వరకు వచ్చే ప్రచారాలు అసత్యమన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ 11వ వార్డులో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పాయం స్వాతి బుధవారం శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. గ్రామపంచాయతీకి పలు విభాగాల నుంచి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పనులు నాణ్యతతో కొనసాగేలా స్థానికులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందిరానగర్ సర్పంచ్ పాయం లలిత, వైస్ఎంపీపీ దాస్యం ప్రమోద్, ఉపసర్పంచ్‌లు యాకూబ్, ఎల్లయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా సతీష్‌కుమార్



నియామకపత్రాన్ని అందజేస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా నగిన సతీష్ కుమార్ బుధవారం విధుల్లో చేరారు. గతంలో సహాయ గణాంక అధికారిగా పనిచేసిన ఆయన ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా పరీక్షలో మొదటి ర్యాంకు సాధించి నియామకం పొందారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి సోమశేఖర్ శర్మ, విద్యాశాఖ కోఆర్డినేటర్లు సైదులు, నాగ రాజశేఖర్, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది సతీష్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.

త్వరలో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఆరోగ్య ఉప కేంద్రం కేంద్రం నిర్మించారు. కానీ నీరు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయకుండా, వైద్యశాఖకు అప్పగించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. దీనిపై గత నెల 14న ‘సాక్షి’లో మందుబాబులకు అడ్డాగా సబ్ సెంటర్.. శీర్షికతో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన ఐటీడీఏ ఏఈ సయ్యద్ సలార్ సబ్ సెంబర్‌లో విద్యుత్, నీటి సౌకర్యం, చిన్నచిన్న మరమ్మతు పనులు చేయించారు. త్వరలో ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి కందుల దినేష్ బుధవారం తెలిపారు.

ముస్లిం ఐక్య సొసైటీ ఎన్నిక



మాట్లాడుతున్న మంజూరు అలీఖాన్

పాల్వంచ: పాల్వంచ ముస్లిం ఐక్య సొసైటీ అధ్యక్షుడిగా ఎండీ.మంజూరు అలీఖాన్, కార్యదర్శిగా ఎస్ఏ.రెహమాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకే.ఖాజామియా, ట్రెజరర్‌గా ఎండీ.అలీఖాన్‌లు నియామకమయ్యారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నూతన కమిటీని మంజూరు అలీఖాన్ ప్రకటించారు. ముఖ్య సలహాదారులుగా సయ్యద్ రషీద్, సలహాదారులుగా ఎస్‌కే.గౌస్ పాషా, రహీం, ఎండీ.షర్ఫే ఆలం, జాయింట్ సెక్రటరీలను, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పంచాయతీల్లో పలు ఇబ్బందులు

- ఏడాది క్రితం పంచాయతీ భవనాలు మంజూరు
- పక్కా భవనాలు లేక అవస్థలు
- చెట్ల కిందే సమావేశాలు నిర్వహిస్తున్న దుస్థితి



కొత్తసూరారంలో స్కూల్ ప్రాంగణంలో గ్రామపంచాయతీ కార్యాలయం



అసంపూర్తిగా మందేరకలపాడు పంచాయతీ భవనం

పాల్వంచరూరల్: ఈజీఎస్ కింద గ్రామపంచాయతీలకు పక్కాభవనాలు మంజూరై ఏడాది అయింది. అయినా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పీఆర్, ఐటీడీఏ శాఖల ద్వారా భవన నిర్మాణం కోసం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి. కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం పక్కాభవనాలు మంజూరు చేయకపోవడంతో ఆయా గ్రామపంచాయతీల్లో అధికారులు, పాలకులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోనే అత్యధిక గ్రామపంచాయతీలు కలిగిన పాల్వంచ మండలంలో మొత్తం 36 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో ఉన్న 11 గ్రామపంచాయతీలకు పక్కా భవనాల సౌకర్యం ఉండగా కొత్తగా ఏర్పాటైన 25 గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేవు. కొన్ని గ్రామపంచాయతీలు అద్దెభవనంలో నిర్వహిస్తుండగా.. మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో ఉన్న గ్రామపంచాయతీలకు నెలకు రూ.3వేలు అద్దె చెల్లిస్తున్న పరిస్థితి. సంగం, నారాయణరావుపేట, దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామపంచాయతీలకు అద్దెభవనాలు కూడా లేవు. చెట్ల కిందనే పంచాయతీ సమావేశాలు నిర్వహిస్తున్న దుస్థితి. దంతలబోరు ఎస్సీకాలనీ పంచాయతీ భవనం కొద్ది రోజులు పాఠశాల భవన సముదాయంలో నిర్వహించగా విద్యార్థులకు ఇబ్బంది కావడంతో అద్దె భవనంలోకి మార్చారు. వారు కూడా ఖాళీ చేయించడంతో ప్రస్తుతం భవనం లేక ప్రతినెల సమావేశాలు చెట్ల కిందనే నిర్వహిస్తున్నారు. రేగులగూడెం, లక్ష్మీదేవిపల్లి, కారెగట్టు, సత్యనారాయణపురం, పునుకుల, కోడిపుంజులవాగు, కిన్నెరసాని, ఇల్లెందులపాడుతండా, తవిశలగూడెం, కొత్తసూరారం, బిక్కుతండా, బస్వతారకకాలనీ, కేశవాపురం, నాగారంకాలనీ, రంగాపురం, నారాయణరావుపేట, సంగం, దంతలబోరు ఎస్సీకాలనీ, మల్లారం, ఇల్లెందులపాడుతండా, రెడ్డిగూడెం గ్రామపంచాయతీలకు పక్కాభవనాలు లేవు.

అద్దెభవనాల్లో ఇక్కట్లు..

అద్దెభవనాల్లో కొనసాగుతున్న గ్రామపంచాయతీల్లో ఇరుకు గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని ఆయా సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం కలెక్టర్ నిధుల నుంచి మందేరకలపాడు గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేశారు. అవి సరిపోకపోవడంతో పనులు పూర్తి కాలేదు. మరో రూ.2లక్షలు అవసరం ఉంది.

త్వరితగతిన నిర్మాణం చేయాలి



పాండురంగాపురం తండా గ్రామపంచాయతీకి భవనం లేక అద్దె భవనంలో నడుపుతున్నాం. అయితే అద్దె భవనంలో కనీస సౌకర్యాలు లేవు. దీంతో ఏదైనా సమావేశం నిర్వహించినప్పుడు బాగా ఇబ్బందిగా ఉంది. వెంటనే మంజూరైన పంచాయతీ పక్కా భవనాన్ని వెంటనే నిర్మాణం చేయాలి. – జగదీష్‌కుమార్, సర్పంచ్, పాండురంగాపురం తండా

చెట్ల కిందే సమావేశాలు...



మా గ్రామపంచాయతీకి పక్కా భవనం లేక అవస్థలు పడుతున్నాం. కొంతకాలం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాం. విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని ఖాళీ చేసి అద్దె ఇంట్లోకి మార్చాం. వాళ్లు కూడా ఖాళీ చేయించారు. మళ్లీ అద్దె ఇల్లు దొరకడం లేదు. దీంతో ప్రతినెల చెట్లకిందనే సమావేశాలు నిర్వహిస్తున్నాం. – గద్దల రమేష్, సర్పంచ్, దంతలబోరు ఎస్సీకాలనీ

19న శంకుస్థాపన చేస్తాం



మండలంలో 36 గ్రామపంచాయతీల్లో 11పంచాయతీలకు పక్కా భవనాలు ఉన్నాయి. మిగిలిన 25 పంచాయతీలకు పక్కా భవనాలు ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరయ్యాయి. ఈనెల 19న శంకుస్థాపనలు చేస్తాం. మందేరకలపాడు గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సీఎం నిధులతో పూర్తి చేస్తాం. – బి.అప్పారావు, ఎంపీడీఓ

‘గోదావరి’ని ఒడిసిపట్టిన సీఎం కేసీఆర్



సాగునీటి దినోత్సవం సంబురాల్లో మాట్లాడుతున్న హరిప్రియ

ఇల్లెందు: ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా తెలంగాణ ఎడారిగానే ఉండేది. తలాపున గోదావరి ఉన్నా.. పొలాలకు సాగు నీరు అందని వైనం మనందరం ఎన్నో ఏళ్లు అనుభవించాము. అలాంటి తరుణంలో తెలంగాణ సాగు భూముల కోసం గోదావరి నీటిని ఒడిసిపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దే దక్కుతుందని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. బుధవారం ఇల్లెందు మంచినీటి చెరువు కట్టమీద సాగునీటి దినోత్సవం సంబురాలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఒకనాడు తెలంగాణలో 40 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తి సాగు ఉండగా తెలంగాణ ఆవిర్భావం తరువాత 2 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు పండించి ఈ దేశానికి ఆహారం అందించే స్థాయికి తెలంగాణ ఎదిగిందన్నారు. ఒకనాడు ప్రాజెక్టులు తెలంగాణలో కట్టి నీటిని మాత్రం ఆంధ్రాకు తరలించుకు వెళ్లేవారని, ఇప్పుడు ప్రాజెక్టులు ఇక్కడే కట్టి నీటిని కూడా తెలంగాణ మాగాణికే అందిస్తున్న ఘనుడు సీఎం కేసీఆర్ అన్నారు. మిషన్ కాకతీయలో 47 వేల చెరువులను రూ.5,350 కోట్లతో పునరుద్ధరించి చెరువుకట్టలను అలుగులు, తూములను పటిష్టపరిచిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో 333 చెరువులు రూ.65 కోట్లతో మరమ్మతులు చేపట్టి 35,435 ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. రూ.44 కోట్లతో 17 చెక్ డ్యాంలు నిర్మించి 3,366 ఎకరాలకు సాగు నీరు అందించటం వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం మంచినీటి చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా మార్చిన పనులను పరిశీలించి కట్ట మీద ఏర్పాటు చేసిన లైటింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీ, ఉమ, పులిగళ్ల మాధవరావు, కౌన్సిలర్లు, తహసీల్దార్ కృష్ణవేణి, కమిషనర్ అంకుషావలీ, నీటిపారుదలశాఖ ఈఈ కేఎల్. శ్రీనివాసాచార్యులు, డీఈ భాగ్యరాజ్ రాథోడ్, కృష్ణ, రవి, ఏఈలు దిలీప్‌కుమార్, రవికుమార్, రమేష్, వినోద్, మానిక, స్వాతి తదితరులు ఉన్నారు.

హామీలు గాలికొదిలేసి వేడుకలా?



మాట్లాడుతున్న పూనెం కుమార్

ఇల్లెందురూరల్: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన సీఎం కేసీఆర్ ఏం సాధించారని దశాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నారని ప్రజాపంథా సబ్‌డివిజన్ కార్యదర్శి పూనెం కుమార్ విమర్శించారు. దీక్షా దివస్‌లో భాగంగా మండలంలోని పోచారంతండా గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5లక్షల కోట్లు అప్పు తెచ్చి ప్రజలపై భారం మోపిన సీఎం కేసీఆర్‌కు ఉత్సవాలు నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉచిత ఎరువుల పంపిణీ, కాంట్రాక్టు వ్యవస్థ క్రమబద్ధీకరణ, రేషన్ కార్డులు, ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీటి సరఫరా.. ఇలా ఎనో హామీలతో అధికారాన్ని హస్తగతం చేసుకున్న సీఎం కేసీఆర్ మరోసారి తన గారడీని ప్రదర్శించేందుకు ఉత్సవాల పేరుతో ప్రజల వద్దకు వస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, శ్రీరాం కోటయ్య, బుర్ర రాఘవులు, మూనా తదితరులు పాల్గొన్నారు.

‘పీపుల్స్ మార్చ్’ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కృష్ణయ్య

జూలూరుపాడు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఈనెల 25 లోగా ఖమ్మం జిల్లాకు చేరుకోనున్నదని జూలూరుపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య అన్నారు. బుధవారం జూలూరుపాడులో ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడు మండలం పిప్పిరి గ్రామంలో ప్రారంభమైన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర ఖమ్మం చేరుకోవడంతో పాదయాత్ర ముగియనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో లకావత్ లచ్చు నాయక్, ముత్తినేని రామయ్య, చాపలమడుగు నరసింహారావు, తాళ్లూరి అచ్చయ్య, బానోత్ బాబు, గుగులోత్ నాగేశ్వరరావు, ధరావత్ లాల్ కోటి, పోతురాజు మోహన్‌రావు, సాంబ, తదితరులు పాల్గొన్నారు.

కళారంగంలో మరింతగా రాణించాలి

కొత్తగూడెంటౌన్: ఇటీవల ఓ ప్రైవేట్ టీవీ చానల్‌లో నిర్వహించిన డ్యాన్స్ ప్రోగ్రాం డీ షో విన్నర్ టీం సభ్యుడు జీవన్‌రాజును కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ అభినందించారు. బుధవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐని జీవన్‌రాజు, తండ్రి రమాపతి పవన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవన్‌రాజును సీఐ సన్మానించి అభినందించారు. మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తాను ఎంచుకున్న రంగంలో రాణించేలా కృషి చేయాలన్నారు. జీవన్‌రాజు మరింతగా కళారంగంలో రాణించి జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు.

ఈద్గా వద్ద బోరుబావి ఏర్పాటు

జూలూరుపాడు: జూలూరుపాడు ఈద్గా వద్ద బుధవారం బోరు బావి ఏర్పాటు చేశారు. ముస్లింల ప్రార్థనా స్థలం (ఈద్గా) వద్ద తాగు నీటి సౌకర్యం లేని విషయాన్ని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎస్కే మహబూబ్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎస్కే సుబానీ వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బోరు బావి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఎంపీపీ లావుడ్యా సోనీ డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నున్నా రంగారావు, రాంశెట్టి రాంబాబు, సయ్యద్ యాసీన్, ఎస్కే బాబాజీ, ఎస్కే లతీఫ్ పాల్గొన్నారు.

పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భానుచందర్



టేకులపల్లి: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఈనెల 5, 6 తేదీల్లో జరిగాయి. ఈ సభలో రాష్ట్ర కమిటీలోకి టేకులపల్లి మండలానికి చోటు లభించింది. పీవైఎల్ కొత్తగూడెం ప్రధాన కార్యదర్శిగా ఉన్న టేకులపల్లికి చెందిన నోముల భానుచందర్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీంంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ భృతి రూ.3116 ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, యువతీ, యువకులకు ఉపాధి కోసం షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోముల ఎన్నికపట్ల టేకులపల్లి మండల అధ్యక్షుడు భూక్యా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి తోటకూరి సతీష్ కుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్వీట్లు పంపిణీ చేయండి

ఇల్లెందు: సింగరేణిలో రెగ్యులర్ కార్మికులతో సమానంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సీతకన్ను తగదని ఏఐటీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి డి.శంకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సింగరేణిలో కార్మికులకు స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేశారని, కానీ కాంట్రాక్ట్ కార్మికులకు పంపిణీ చేయలేదన్నారు. తక్షణమే వారికి స్వీట్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగయ్య, వినయ్, అనిల్, కనకతార, పద్మ, శ్యామల, సునిత, రమ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ఎంపీ విస్తృత పర్యటన

సింగరేణి(కొత్తగూడెం): బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో పర్యటించారు. పలువురి గృహప్రవేశాలు, వివాహాలకు హాజరై ఆశీర్వదించారు. అలాగే, ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎంపీ పరామర్శించారు. జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్ రవితో పాటు సోనీ, వనమా రాఘవేంద్రరావు, సురేష్‌గౌడ్, బిక్కసాని నాగేశ్వరరావు, కొట్టి వెంకటేశ్వర్లు, బీమా శ్రీధర్, గుగులోత్ కృష్ణ, దామోదర్, మసూద్, రాంబాబు, రాజుగౌడ్, సత్యనారాయణ, రమణమూర్తి, నాయుడు, నల్లమల సత్యనారాయణ, బండి అంజయ్య, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



మాట్లాడుతున్న మహిపతిరామలింగం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు ముందుకొచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం తెలిపారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మ తల్లి) ఆలయంలో బుధవారం భక్తులు, దాతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ సముదాయంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను 12వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎల్లంకి సతీష్‌కుమార్ భక్తుల సౌకర్యార్థం గది నిర్మాణం, నూతక్కి వెంకటేశ్వరరావు అన్నదానం హాల్ నిర్మాణం, ఎన్‌పీ నాయుడు మరోఇద్దరు మిత్రులతో కలిసి యాగశాల నిర్మాణం, సునీత వెంకటేశ్వరరావు, పోలసాని రవికుమార్‌లు కలిసి నవగ్రహ మండపం నిర్మాణం చేయించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతనాగరాజు, గంధం వెంగళరావు, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, సంకా రామారావు, కిలారు నాగమల్లేశ్వరరావు, బండి చిన్న వెంకటేశ్వర్లు, కాటారపు లక్ష్మీనారాయణ, పాపయ్యదొర, చలువాది ప్రకాశ్, బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించండి



సీమంతం చేస్తున్న సీడీపీఓ కనకదుర్గ

పాల్వంచరూరల్: రెండేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని, అక్కడ పిల్లలకు పోష్టికాహారంతో కూడిన భోజనం, ఆటపాట, విద్య నేర్పించడం జరుగుతుందని పాల్వంచ ప్రాజెక్టు సీడీపీఓ కనకదుర్గ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండల పరిధి ప్రభాత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇరుప మంగమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆరునెలల చిన్నారులకు అన్నప్రాశన, మూడేళ్లు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో ఆరుగురు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చుకోవడం జరిగిందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు జరగనున్న సాగునీటి పండగ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, సూపర్‌వైజర్ రత్నకుమారి, టీచర్ సరిత, వార్డు సభ్యులు పూర్ణ, వీఓఏ వినోద తదితరులు పాల్గొన్నారు.

మా వృత్తిలోకి ఇతరులు రావొద్దు..



నిరసన తెలుపుతున్న నాయీ బ్రాహ్మణులు

పాల్వంచ: నాయీ బ్రాహ్మణుల వృత్తిలోకి ఇతరులు వచ్చి బార్బర్ షాపులు నెలకొల్పడం తగదని పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు అన్నారు. బుధవారం హరిదామ బజార్‌లో నూతనంగా ఓ బార్బర్ షాపు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న నాయీ బ్రాహ్మణులు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. షాపును ప్రారంభిస్తే అక్కడే టెంట్ వేసి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు బార్బర్ షాపులను నిర్వహించేందుకు పన్నాగం పన్నుతున్నాయని, వాటివల్ల తమ జీవనోపాధి దెబ్బతిని రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కొమరవెల్లి రవీందర్, తూముల సదానందం, శ్రీరాముల ఉదయ్, హరికృష్ణ, బాలకృష్ణ, పుల్లారావు, వెంకన్న, ముత్యాల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా..



ముర్రేడు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. దళారులు అక్రమంగా ఇసుకను తరలించి రూ.లక్షలను సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో శంభునిగూడెం రీచ్ నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఉండేది. ప్రస్తుతం అనుమతి లేదు. తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్నట్లు ఇసుకాసురులు ముర్రేడు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. చంద్రుతండా నుంచి మేళ్లమడుగు సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఉదయం ఇసుకను తెచ్చి సూర్యతండా పాఠశాల ఆవరణలో, గోప్యాతండా రోడ్డు పక్కన, మరికొన్ని చోట్ల ఇసుకను డంప్ చేసుకుంటున్నారు. మరికొంత మంది ట్రాక్టర్లలోనే ఇసుక లోడ్‌ను ఇళ్ల వద్ద సిద్ధంగా ఉంచుతున్నారు. రాత్రి ఏడు గంటలు కాగానే ఇసుక అక్రమ రవాణా మొదలవుతుంది. చంద్రుతండా మొదలుకుని బొమ్మనపల్లి, రాజుతండా, సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, టేకులపల్లి పోలీసు స్టేషన్ మీదుగా ఇల్లెందుకు, ఇతర ప్రాంతాలకూ ఇసుక రవాణా చేస్తున్నారు. ప్రధాన రహదారుల గుండానే ఇసుక రవాణా చేస్తున్నప్పటికీ సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై తహసీల్దార్ వీరభద్రంను వివరణ కోరగా.. టేకులపల్లి మండలంలో ఇసుక రీచ్‌లకు ఎలాంటి అనుమతులు లేవు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డిని వివరణ కోరగా.. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి తమ దృష్టికి రాలేదని, ఎవరైనా సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలి



ఇల్లెందురూరల్: సుదిమళ్ల పెద్దచెరువు కట్టను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

ఇల్లెందురూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. మండలంలోని సుదిమళ్ల పెద్దచెరువును బుధవారం ఆమె పరిశీలించారు. చెరువు కట్టపై ముళ్లపొదలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుకట్ట ప్రాంతంలో ముగ్గులు వేసి తోరణాలతో అందంగా అలంకరించాలని చెప్పారు. గ్రామాల నుంచి రైతులు, మత్స్యకారులు డప్పువాయిద్యాలు, బోనాలు, బతుకమ్మలతో చెరువు కట్ట వద్దకు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జాగ్రత్తలు పాటించాలి...

పాల్వంచరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు ఊరూరా నిర్వహించే చెరువు పండగ కార్యక్రమంలో ప్రజలు చెరువుల దగ్గరకు వెళ్లినప్పుడు నీటిలో దిగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో చెరువుకట్టపై కట్టమైసమ్మకు పూజలు చేయాలని, సాయంత్రం 5గంటలకు పండుగ నిర్వహించాలన్నారు. డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో ఊరేగింపుగా బయలుదేరాలని చెప్పారు. పండుగ వాతావరణం ప్రతిబింబించేలా ముగ్గులు, తోరణాలతో అందంగా అలంకరించుకోవాలని సూచించారు.



అటెన్షన్ ప్లీజ్

పారిశుద్ధ్యం పనులు చేయించరూ..



జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలో, గాంధీనగర్ తండాలోని డ్రెయినేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. పూడిక, కర్రలు, రాళ్లు, వ్యర్థాలు, చెత్తతో నిండి మురుగు కదలడం లేదు. వేసవికాలంలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే రాబోయే వానాకాలంలో ఎలా ఉంటుందోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టకపోవడంతో దోమలు వ్యాప్తి పెరుగుతుందని ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : పి కృష్ణ, మండల పంచాయతీ అధికారి, సెల్ నంబర్: 9908188125